

చేసింది చెప్పడం జ్ఞాపకశక్తి. చెప్పింది చేయడం సామర్థ్యం. ఆలోచనకు ఆచరణకు ఉన్న సంబంధమే జ్ఞాపకశక్తికి అనుభవానికి ఉందంటున్నారు తూర్పు వంశీకృష్ణ. తన జ్ఞాపకాల్లో నిలిచిపోయిన పాఠాలను గుర్తు చేసుకుంటూ నేటి తరగతి గదులు అనుభవపూర్వకమైన బోధనకు ఆలవాలంగా మారాలంటున్నాడు. ఆ మార్పు సాధించేలోగా నష్టపోకుండా ఇప్పుడు మా 'యాక్టివ్ డిస్కవరీ క్యాంపస్‌కి రండి' అని పిలుపునిస్తున్నాడు . ఇక్కడ బడిలో చెప్పే విశేషాలన్నీ ప్రయోగపూర్వకంగా, అనుభవపూర్వకంగా తెలుసుకోవచ్చు. ఇక ఆ విషయాలను ఎప్పటికీ మర్చిపోరు! చిన్ననాటి కలను సాకారం చేసుకునేందుకు తను చేసిన ప్రయత్నాలు, యాక్టివ్ డిస్కవరీ విశేషాలు చెబుతున్నాడు వంశీ!



# ఇక్కడ అనుభవాలే పాఠాలు!



మాది మహబూబ్ నగర్ జిల్లాలోని గార్లపాడు. నేను రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివాను. మూడో తరగతిలో ఉన్నప్పుడు మా లక్ష్మీకాంత్ సార్ తెల్లవారుజామున నిద్రలేపేవారు. 'అదిగో... ఆ తూర్పు దిక్కుగా చూడండి. ఆకాశంలో దీపంలో కనిపిస్తూ ఉందే... అదే శుక్ర గ్రహం!' అని చెప్పేవారు. అప్పటి నుంచి శుక్రగ్రహం పేరు, దాని గురించి మా సార్ చెప్పిన విశేషాలన్నీ నాకు గుర్తున్నాయి. తొమ్మిదో తరగతిలో ఇండస్ట్రియల్ స్టడీ టూర్‌కు వెళ్లాం. ఓ జౌళి పరిశ్రమలో సల్ఫర్‌తో పత్తిని శుద్ధి చేయడం చూశాను. అప్పుడు తెలుసుకున్న విషయం నాకు ఇప్పటికీ గుర్తుంది! కొంతమంది చదివి నేర్చుకుంటారు. కొంతమంది విని నేర్చుకుంటారు. మరికొంతమంది చేయడం ద్వారా నేర్చుకుంటారు. నాది చేయడం ద్వారా నేర్చుకునే తత్వం. నేను చేసింది ఏదీ మర్చిపోలేదు. అందుకే చదువు అనుభవపూర్వకంగా ఉండాలన్నది నా ఆశ.

### సక్సెస్ తర్వాత యాక్టివ్

ఎంబీఏ చదివిన తర్వాత హైదరాబాద్‌లో కంప్యూటర్ నెట్‌వర్క్ ట్రైనింగ్ సెంటర్స్ నిర్వహించాను. మూడు శిక్షణా సంస్థలు, వంద మంది దాకా ఉద్యోగులు, సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఉండేవారు. ఇంతకన్నా సాధించాల్సింది ఏముంటుంది అనిపించింది. కానీ, ఏదో వెలితి! ఏదో ఒకటి చేయాలన్న తపన నన్ను ఊరికే ఉండనివ్వలేదు. అనుభవపూర్వక (ప్రాక్టికల్) విద్య కోసం పనిచేయాలని ముందడుగు వేశాను. హైదరాబాద్‌కు దగ్గరలోని గోపన్‌పల్లిలో నాలుగు ఎకరాల భూమి



